# కుంభకర్ణుడి హాశ్చర్యం

గల్పిక

మణిభూషణ్

ఎట్టకేలకు కుంభకర్ణుడిలో చలనం కనిపించింది. వంగిపోయిన బల్లాలతో, నీరసించిన శరీరాలతో దేవుళ్లాడుతున్న రాక్షస భటుల ముఖాలు వికసించాయి. లేని ఉత్సాహం తెచ్చుకున్నారు.

'ఎంత రాక్షసుడైతే మాత్రం ఇలా తొంగోవడమే?' అని సందేహం వ్యక్తం చేశాడు కాంపెన్సేటరీ కోటాపై చేరిన కొత్త భటుడు.

'ఇప్పుడేవుంద్రా! అల్లప్పుడు సొర్గం మీద యుద్దానికి ఎల్లిన రోజుల్లోనైతే నా ఒక్కడి సేతుల్లోనే 40 బల్లాలొంగిపోయాయి. ఇక, మీ అయ్యకైతే దమ్ము రోగమొచ్చేసింది. అదలాగ ముదిరిపోయి ముదిరిపోయే చివరకు సచ్చిపోతే ఆ ఉద్యోగం నీకిచ్చారు. సర్లే పని కానీ' అన్నాడు సీనియర్ భటుడు.

ఓహో నాకు ఉద్యోగం రావడం వెనుకున్న కథకి నాయకుడు ఈ కుంభకర్ణుడేనన్నమాట అనుకుంటూ 'కాంపెన్సేటరీ భటుడు' కసిగా మరో రెండు పోట్లు ఎక్కువ పొడిచాడు.

కళ్లు తెరిచాడు కుంభకర్ణుడు. మత్తుగా మూలిగాడు.

ఎప్పుడూ తాను కళ్లు తెరవగానే సోకే ఘుమఘుమలు ఈసారి సోకలేదు. కోపమొచ్చింది. ఎదురుగా బల్లెంతో నిలబడ్డ భటుడిని తన్నుతో సత్కరించబోయి ఆగిపోయాడు. తన మంచానికి చేరువగాఉన్న బల్లలపై వివిధ మాంస భక్ష్యాదులు చక్కగా అమర్చి కనిపించాయి. ఆశ్చర్యపోయాడు. మామూలుగా తినే పదార్థాలకన్నా ఎక్కువగానే కనిపించాయి. పైగా, అరుదుగా కనిపించే కోతి మెదడు, మనిషి మొండెంవంటి ప్రత్యేక వంటకాలుకూడా ఉన్నాయి. కానీ, మునుపటి ఆ ఘుమఘుమలుమాత్రం లేవు. తన ముక్కుకేమైనా అయ్యిందా అని అనుమానించి ఒక్కసారి బలంగా నిశ్వాసమిడిచాడు. ఆ గాలి తాకిడికి భటుడు అల్లాడిపోయారు.

ముందు వరుసలోని భటుడొకరు తెగించి- 'క్షమించాలి ప్రభూ, తమరి ప్రధాన వంటగాడు నిద్ర లేవనందున మీ వంటశాలలో వండలేకపోయాం. అందుకనే రావణ చక్రవర్తిగారి గృహం నుంచి వీటిని తేవలసి వచ్చింది. తమరి వదినగారైన మహారాణి మండోదరి మీకు ఎంతో ఇష్టమని ఈ కోతి తలకాయ, మనిషి మొండాలను వండించి పంపారు. ఎన్నడో వారి వివాహమైన తొలి రోజుల్లో మహారాణివారు తమరికి వాటిని వండి పెట్టారట! తిరిగి అటువంటి అవకాశం వస్తుందో రాదో అని ఇప్పుడే పంపారు' అన్నాడు.

కుంభకర్ణుడి కళ్లు అనుకోకుండానే పెద్దవయ్యాయి. తన మందిరంలో తననే మించిన నిద్రపోతు ఒకడున్నాడనే సరికి ఆగ్రహం కలిగింది. కోపావేశాలకన్నా ఆకలి బలమైనది, తెలివైనది కాబట్టి, కుంభకర్ణుడిని గుర్తు చేసింది.

'సరే ముందు ఆకలిని శాంతపరిచి అప్పుడు వాడి సంగతి చూద్దాం' అని పళ్లాలవైపు కదిలాడు. ఒక్కొక్కటిగా కడుపులో చేరుతున్న కొద్దీ తన ప్రధాన వంటగాడిపై గల ఆగ్రహంలో మార్పులు రాసాగాయి. ఆఖరి దుమ్ములోని మూలుగను బలంగా పీల్చేసరికి ఆగ్రహం కాస్తా అనురాగంగా మారిపోయింది.

'నిద్ర లేపడానికి ప్రయత్నించలేదా?' అని అడిగాడు.

'మిమ్మల్ని లేపడానికి ముందే ఆయనవద్ద ప్రయత్నించాం ప్రభూ. కానీ, యుద్ధానికి సమయమవుతుందని రావణులవారు తొందరపెట్టారు. తన మందిరంలోనే మీకిష్టమైనవన్నీ వండిస్తామని చెప్పి ఆ ప్రయత్నం విరమింపజేసి, మీ సంగతి చూడమన్నారు ప్రభూ' అని సంజాయిషీ ఇచ్చుకున్నారు.

కుంభకర్ణుడిలో ఆశ్చర్యం రెండింతలు మూడింతలయ్యింది.

'అతడెక్కడ?' అని అడుగుతూనే తన వంటశాలవైపు కదిలాడు. దారిలో ఒక నల్లగా నూనె సిద్ధిలా ఉన్న ఒక అధికారి శ్రద్ధగా రాతబల్లపై చేతులాన్చి జమాబందీ చూసుకుంటున్నాడు. ఆ పక్కనే ఉన్న ఒక భటుడు బల్లెంతో పొడవబోతే...

కుంభకర్ణుడు వారిస్తూ, 'పని చేసుకోనివ్వండి. అతని కార్యదీక్షను ఎందుకు చెడదీయడం. నన్ను ప్రధాన వంటగాడి వద్దకు తీసుకెళ్లండి చాలు' అన్నాడు.

'అతగాడే ప్రభూ' అన్నారు భటులు.

'నిజమా...?' అని దిగ్భ్రాంతి చెంది తమాయించుకుని తేరిపార చూశాడతడిని.

చేతిలో ముళ్లపంది ముల్లు, ఎదురుగా శుభ్రపరిచిన మానవ తోలు కాగితాలు, పక్కనే రక్త సిరాతో నిండిన బుడ్లు, కునుకేస్తున్నా తూలకుండా నిబ్బరంగా కూర్చున్న ఆ అధికారిని చూసి మరోసారి కంగుతిన్నాడు. దగ్గరగా వచ్చి వంగి చూశాడు. 'నిజమే...!' అన్నాడు.

ఓహో...! ఇంతకాలం నాదే ఘనమైన నిద్రగా భావించానే! నాదీ ఒక నిద్రేనా? ఎనుబోతుల తోళ్లపై మేనువాల్చి, ఊరబెట్టిన పంది దిండులపై తలూని, కుక్కతోకలకు అమర్చిన కోడి ఈకల వింజామరల గాలిని అనుభవిస్తూ... గడిపిన నిద్రావస్థా ఒక అవస్థేనా? అదంతా వర్థి అవస్థ. ఇతగాడిది నిజమైన నిద్ర. సరైన గాలి లేదు. స్థిరమైన ఆసనం లేదు. మేను ఆన్చడానికి బాలీసు లేదు. మెడ వాల్చడానికి దిండు లేదు. అయితేనేం... కన్ను తెరవలేదు. మెలకువ తెచ్చుకోలేదు. నిద్రాదేవినే వరించిన ఇతగాడిని తగిన బిరుదంతో సత్కరించాల్సిందేనని మనసులో పరిపరివిధాలా తలపోశాడు.

'ఈతడి పేరేమి?' అని ధీరగంభీరతతో అడిగాడు.

'ఆతని పేరు మరచిపోయి దీర్ఘకాలమైంది ప్రభూ. మేమందరమూ 'కునుకేశం' అని, 'కునుకాసుర' అని ప్రస్తావించడం పరిపాటి అయినది' అని 'కాంపెన్సేటెడ్ భటుడు' చొరవగా చెప్పాడు.



'అహో! ఏమి చక్కని పేర్లు. అవియే ఇతగాడికి సరియైన బిరుదులు కాగలవు. నేను యుద్ధం నుంచి రాగానే లంకేశులవారి అధ్యక్షతన సభ ఏర్పరచి 'కునుకేశం' బిరుదునివ్వగలం. అంత వరకూ ఆయనను కదిలించవలదు' అని చకచకా యుద్ధ రంగానికి తరలి వెళ్లాడు కుంభకర్ణుడు.

అదే తలంపుతో వెళ్లడం వల్లనో ఏమో అపజయమన్నదే ఎరుగని కుంభకర్ణుడు యుద్ధం నుంచి తిరిగి రాగలదు. కునుకేశుడు నిద్ర లేవలేదు.

*(విధి నిర్వహణలో ఉండగా నిద్ర పోయే వారిని ఉద్దేశించి రాసినది కాదు)*